నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్,శనివారం 27 జనవరి 2024 | HYDERABAD




## తిరంగా.. మది మురవంగ

నగరంలో జాతీయత ఉట్టిపడింది. శుక్రవారం నగరవ్యాప్తంగా గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వివిధ సంస్థలతో పాటు వాడవాడలా త్రివర్ణ పతకాలను ఎగురవేశారు. దేశభక్తిని చాటేలా నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

### శరవేగంగా రెండో దశ మెట్రో

# డీపీఆర్‌ల తయారీ

### మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సిటీబ్యూరో, జనవరి 26 (నమస్తే తెలంగాణ): నగరంలో ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో రైలు ఎంతో కీలకంగా మారిందని, ఈ విషయాన్ని గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి వివిధ ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టు కనెక్టివిటీతో కలిసి 70 కి.మీ పొడవునా మెట్రో విస్తరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. శుక్రవారం బేగంపేటలోని మెట్రో రైల్ భవన్‌లో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ప్రతిపాదించిన విస్తరణతో సమాజంలోని అన్ని వర్గాలకు మెట్రో సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. అదేవిధంగా పెట్టుబడులకు ఆకర్షణీయమైన ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్ ఆవిర్భవించడంలో సైతం ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. రెండో దశ మెట్రో కారిడార్ల కోసం ట్రాఫిక్ సర్వేలు, డీపీఆర్‌ల తయారీ శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు.



వేదికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

### నేడు యూసుఫ్‌గూడలో

# జూబ్లీహిల్స్ సన్నాహక సమావేశం

### హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జూబ్లీహిల్స్, జనవరి 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం యూసుఫ్‌గూడలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నారు. మహమ్మద్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. ఈ మేరకు సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్‌తో కలిసి పరిశీలించారు.

## పీపుల్స్ ప్లాజాలో 1 నుంచి నర్సరీ మేళా

సిటీబ్యూరో, జనవరి 26 (నమస్తే తెలంగాణ): మొక్కలు నాటడం అంటే రాబోయే తరానికి మంచి భవిష్యత్తు ఇవ్వడమేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి తుమ్మల 15వ గ్రాండ్ నర్సరీ మేళాకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఆలిండియా హార్టీకల్చర్, అగ్రికల్చర్ షో ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభమవుతుందన్నారు. 5 రోజుల పాటు జరిగే ఈ మేళాలో రకరకాల ఉత్పత్తులు, పండ్లు, కూరగాయల తోటలు, ఎరువులు, ఆర్గానిక్ ఉత్పత్తులు ప్రదర్శిస్తారన్నారు. నర్సరీ మేళా ఇన్‌చార్జి ఖాలిద్ అహ్మద్ మాట్లాడుతూ ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుందని వెల్లడించారు.





సత్యనారాయణరెడ్డి (ఫైల్)

## హిట్ అండ్ రన్ కేసులో..

*బంజారాహిల్స్, జనవరి 26: జూబ్లీహిల్స్ హిట్ అండ్ రన్ కేసుకు సంబంధించి శుక్రవారం 'నమస్తే తెలంగాణ' పత్రికతో పాటు మిగతా పత్రికల్లో కూడా నిందితుడు లింగాల రుత్విక్‌రెడ్డి పేరుతో ప్రచురితమైన ఫొటో విషయంలో పొరపాటు జరిగింది. పోలీసులు సమాచార లోపం కారణంగా రుత్విక్‌రెడ్డి ఫొటోగా భావించి అమెరికాలో నివాసముంటున్న సత్యనారాయణరెడ్డి అనే వ్యక్తి ఫొటోను మీడియాకు చేరవేశారు. పై ఫొటోలో ఉన్న వ్యక్తికి జూబ్లీహిల్స్ హిట్ అండ్ రన్ కేసుతో ఎలాంటి సంబంధం లేదని ఆయన అమెరికాలో నివాసం ఉంటున్నారని పోలీసులు తెలిపారు.*

# పంజాగుట్టలో కారు బీభత్సం

### వెంబడించి.. నిందితుడిని పట్టుకున్న స్థానికులు

ఖైరతాబాద్, జనవరి 26 : పంజాగుట్ట ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి మరో హిట్ అండ్ రన్ ఘటన జరిగింది. కారు నడిపించే వ్యక్తి మద్యం మత్తులో పలు వాహనాలను ఢీకొట్టుకుంటూ వెళ్లాడు. అప్రమత్తమైన స్థానికులు అతడిని వెంబడించి పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు ఎస్ఆర్‌నగర్‌కు చెందిన మహ్మద్ అమీర్ అలీ (30)గా గుర్తించారు. కొద్ది రోజుల కిందట జూమ్ యాప్‌లో కారును బుక్ చేసుకొని వారికి అప్పగించకుండా తిరుగుతున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించి కారు నడుపుతూ పంజాగుట్ట మెట్రో స్టేషన్ రహదారిలో పలు వాహనాలను ఢీకొట్టాడు. దీంతో స్థానికులు అతడిని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో పలు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి.



**రూల్స్ పాటిస్తే..క్షేమంగా చేరుకుంటాం** | నుమాయిష్‌లోని ట్రాఫిక్ స్టాల్‌లో శుక్రవారం చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



## మరో నాలుగు

### వ్యర్థాలతో వెలుగులు

# డంపింగ్ యార్డులు

### వ్యర్థాల రీసైక్లింగ్‌తో విద్యుత్ ఉత్పత్తి

## స్థలాలను పరిశీలిస్తున్న బల్దియా

### జవహర్‌నగర్‌కు ప్రత్యామ్నాయంగా అడుగులు

సిటీబ్యూరో, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై పడుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు మరో నాలుగు డంపింగ్ యార్డుల ఏర్పాటుకు జీహెచ్ఎంసీ కసరత్తు ప్రారంభించింది. జనావాసాలకు దూరంగా వీటిని ఏర్పాటు చేయాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటిస్తున్నారు. స్థలాలను పరిశీలిస్తున్నారు. స్థల సేకరణ ఒక్కటే కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యావరణంగాపరంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ, కొత్తగా ఏర్పాటు చేసే డంపింగ్ యార్డులతో స్థానిక ప్రజలను ఒప్పించడం వంటి అంశాలపై దృష్టి పెట్టారు. జీహెచ్ఎంసీ ఇతర నగర పాలక సంస్థల నుంచి రోజు వారీగా ప్రతిరోజు సుమారు 7611 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. వీటిని నిల్వ ఉంచకుండా ట్రీట్‌మెంట్ డిస్పోజల్ చేసే ప్రక్రియకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. తడి చెత్త ద్వారా కంపోస్టు ఎరువు, బయో గ్యాస్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేయడం, పొడి చెత్తలో కాలే గుణం గల వ్యర్థాలను పోగు చేసి.. విద్యుత్ తయారీకి వినియోగిస్తున్నారు. జవహర్‌నగర్‌తో పాటు కొత్తగా ఏర్పాటు చేసే డంపింగ్ యార్డు వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి.. టీఎస్ఎస్పీడీఎల్ సమన్వయంతో విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించనున్నట్లు అధికారులు తెలిపారు.

### రీ సైక్లింగ్‌తో అద్భుత ఫలితాలు

సిటీబ్యూరో: హైదరాబాద్‌ను సుందర నగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా గత సర్కారు తీసుకున్న నిర్ణయాలు అద్భుతమైన ఫలితాలు రాబడుతున్నాయి. నిర్మాణ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా చూసేందుకు నగరానికి నలువైపులా నాలుగు (కన్‌స్ట్రక్షన్ అండ్ డీమాలిషన్) ప్లాంట్‌ను గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నెలకొల్పారు. తొలుత జీడిమెట్ల, ఫతుల్లాగూడలో వీటిని ఏర్పాటు చేయగా..ఆ తర్వాత తూంకుంట, శంషాబాద్ శాతంరాయిలో సీ అండ్ డీ ప్లాంట్లను నెలకొల్పారు. ఒక్కో ప్లాంట్ నుంచి రోజూ 500 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తరలించి శుద్ధి చేస్తున్నారు. ఏడాది కాలంగా 2,54,561 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను వివిధ ప్రాంతాల నుంచి ప్లాంట్లకు తరలించగా..అందులో 1,27, 571 టన్నుల వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి పునర్వినియోగంలోకి తీసుకొచ్చారు. కాంక్రీట్ దిమ్మెలు, ఇటుక గోడలు, రాళ్లను , చెక్క, ప్లాస్టిక్, ఇనుము, అల్యూమినీయం వంటి వస్తువులను నిర్వహణ కేంద్రాల్లోని యంత్రాల్లో వేయగానే తుక్కుతుక్కు అవుతాయి. నీటి ప్రవాహం వాటిలోని మట్టిని వేరు చేస్తుంది. సాంప్రదాయ ఇసుక, కంకరను పోలిన రెండు రకాల ఇసుక, రెండు రకాల కంకర బయటకు వస్తాయి. లోహాలు, కాగితం, ప్లాస్టిక్, మట్టి, తారు, చెక్క వేర్వేరుగా బయటకు వచ్చేస్తాయి. బంకమట్టిని సిమెంట్ తయారీకి, ఇసుక కంకరతో ఇటుకలు, పేవర్ బ్లాక్స్ వంటి వస్తువులను తయారు చేస్తున్నారు.



పెద్దపల్లి జిల్లా పన్నూర్‌లో విక్రమ్‌కు ఇంటింటా ఇన్నోవేటర్ అవార్డును ప్రదానం చేస్తున్న గ్రామ పంచాయతీ అధికారుల బృందం

## ఇంటింటా ఇన్నోవేటర్..

సిటీబ్యూరో, జనవరి 26 (నమస్తే తెలంగాణ): గ్రామీణ ప్రాంతాల నుంచే ఆవిష్కర్తలను ప్రోత్సహించేలా తెలంగాణ రాష్ట్ర ఐటీ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ డైరెక్టర్ అజిత్ రంగ్‌నేకర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటా ఇన్నోవేటర్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు రూపొందించిన ఆవిష్కరణలను గుర్తించి, వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయిలో అవార్డులు ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా జనవరి 26న 20 జిల్లాల పరిధిలోని 44 మంది గ్రామీణ ఆవిష్కర్తలకు ఇంటింటా ఇన్నోవేటర్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డులను అందజేసినట్లు చెప్పారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇన్నోవేటర్‌గా గుర్తించిన వారికి ఆయా గ్రామాల్లోనే అవార్డుల ప్రదానం చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. విలేజ్ ఇన్నోవేషన్ అవార్డులు పొందిన జాబితాలో భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జనగాం, కామారెడ్డి, కరీంనగర్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మేడ్చల్, మెదక్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, వనపర్తి, సిద్ధిపేట, సూర్యాపేట,యాదాద్రి భువనగిరి, నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలు ఉన్నాయని తెలిపారు.

## మెజార్టీ కార్పొరేటర్లు.. మేయర్ జక్కా వెంటే

పీర్జాదిగూడ: పీర్జాదిగూడ మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కాంగ్రెస్ నాయకులు పావులు కదుపుతున్నట్లు చర్చ కొనసాగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఏదో విధంగా ప్రలోభపెట్టి మేయర్‌ను గద్దె దించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జక్క వెంకట్‌రెడ్డిని గద్దె దించేందుకు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి క్యాంపు రాజకీయాలు చేస్తున్నారు. అయితే మెజార్టీ కార్పొరేటర్లు మాత్రం మేయర్ జక్క వెంకట్‌రెడ్డి వెంటే ఉండటం విశేషం.









# అదే జోష్

ఉప్పల్ స్టేడియం వేదికగా భారత్-ఇంగ్లాండ్ మొదటి టెస్టు రెండో రోజు సైతం ఉత్సాహంగా సాగితే.. ఆటను వీక్షించేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. కొందరు వివిధ సందేశాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించి..తమ ఆరాధ్య ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. మరికొందరు త్రివర్ణ పతకాలను చేతబూని జాతీయతను చాటుకున్నారు.

